# అగ్నిమాపక సిబ్బంది సేవలు అభినందనీయం



కల్వకుర్తి ఫైర్‌స్టేషన్‌లో వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

- ప్రమాదం తలెత్తితే 101 నెంబర్‌కు డయల్ చేయాలి
- కల్వకుర్తి ఫైర్‌స్టేషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 6 : తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక రాష్ట్ర ప్రభుత్వం అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారిస్తోందని ప్రమాదాల నివారణలో అగ్నిమాపక సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. శుక్రవారం పట్టణంలోని ఫైర్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫైర్‌స్టేషన్‌కు చేరుకున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను జిల్లా ఫైర్ ఆఫీసర్ సందేశ్‌కుమార్ ఘనంగా స్వాగతించి సత్కరించిన అనంతరం ఫైర్ సిబ్బంది ఎమ్మెల్యేకు గౌరవ వందనం సమర్పించారు. ఫైర్‌స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో భాగంగా ఫైర్ స్టేషన్ వద్ద పూజలు నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించి వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి పాలకులు అగ్ని ప్రమాదాల పట్ల నిర్లక్ష్యంగా ఉండేవారని ఫైర్ స్టేషన్‌లు, వాహనాల సంఖ్య చాలా తక్కువ సంఖ్యలో ఉండేవన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేసి ఫైర్ వాహనంతో పాటు చిన్న చిన్న ప్రమాదాలను నివారించేందుకు చిన్న వాహనాన్ని ఏర్పాటు చేసిందని వివరించారు. ఫైర్‌స్టేషన్‌ల ఏర్పాటుతో అగ్ని ప్రమాదాలు జరిగిన చోటుకు వెంటనే సిబ్బంది స్పందించి ప్రమాదాలను తగ్గించేందుకు కృషి చేస్తున్నారని వివరించారు. శుక్రవారం తెలంగాణ వ్యాప్తంగా 18 ఫైర్ స్టేషన్ల 36 ఎస్‌ఆర్‌డీఎఫ్ బైక్‌లను రాష్ట్ర హోంశాఖ మంత్రి వర్చువల్‌గా ప్రారంభించారని జిల్లా ఫైర్ అధికారి సందేశ్‌కుమార్ పేర్కొన్నారు. తమ పరిసరాల్లో అగ్నిప్రమాదాలు తలెత్తితే 101 నెంబర్‌కు డయల్ చేసి సమాచారం అందిస్తే వెంటనే అక్కడకు చేరుకుని ప్రమాదాలను నివారిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, ఏఎంసీ చైర్మన్ విజయ్‌గౌడ్, పీఏసీసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, కౌన్సిలర్లు చైతన్య కిశోర్‌రెడ్డి, శ్రీశైలం, ఆర్డీవో శ్రీను, తాసీల్దార్ రాజేందర్‌రెడ్డి, ఫైర్ అధికారులు కృష్ణమూర్తి, కల్వకుర్తి ఇంచార్జ్ దేవేందర్‌రెడ్డి, డీఎస్పీ పార్థసారథి, సీఐ ఆంజనేయులు, ఎస్సై రమేశ్ ఫైర్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



బ్యాంకు సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్

కల్వకుర్తి రూరల్,అక్టోబర్ 6 : గ్రామీణ ప్రాంత ప్రజలకు, రైతులకు, యువతీ యువకులకు ఏపీజీవీబీ బ్యాంకు ద్వారా అందించే రుణాలను, బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ మేనేజర్ సంతోష్‌కుమార్ కోరారు. శుక్రవారం పట్టణంలోని వైఆర్‌ఎం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ప్రతిపథకం బ్యాంకుల ద్వారా చెల్లింపులు చేస్తోందని ప్రతిఒక్కరూ బ్యాంకు ఖాతాను కలిగి ఉండాలన్నారు. పీఎం సురక్షబీమా యోజన, పీఎం జీవనజ్యోతిబీమా యోజన, పీఎం అటల్‌పెన్షన్ యోజన, నగదురహిత లావాదేవీలు, సైబర్ నేరాలు పలు అంశాలపైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాజాత బృందం పథకాలపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ వినోద్‌కుమార్, సిబ్బంది, కళాశాల అధ్యాపకులు తదితరులు ఉన్నారు.


## యువత లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకుసాగాలి



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

వెల్దండ, అక్టోబర్ 6 : యువత లక్ష్యం ఎంచుకొని ముందుకు సాగితే ఏదైన సాధించొచ్చని గౌడ సంక్షేమ సంఘం తాలూకా ఉపాధ్యక్షుడు నాగరాజుగౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొట్రకు చెందిన చంద్రశేఖర్ ప్రభుత్వం వెలువర్చిన పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించి పోలీస్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. గౌడ సంఘం ఆధ్వర్యంలో చంద్రశేఖర్ అతని తల్లిదండ్రులను పూలమాల, శాలువాలతో సన్మానించి స్వీట్లు తినిపించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ నాగరాజుగౌడ్ మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టి లక్ష్యం,పట్టుదల తో ఉద్యోగాన్ని సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కొట్ర గౌడ్ సంఘం అధ్యక్షుడు అల్లాజీగౌడ్, నాయకులు నాగేశ్‌గౌడ్, దశరథంగౌడ్, గట్టువెంకటయ్యగౌడ్, బాలస్వామిగౌడ్, వెంకట్‌నారాయణగౌడ్, లక్ష్మమ్మ, యాదమ్మ తదితరులు ఉన్నారు.

## కుర్మిద్ద గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడి ఎన్నిక



పర్వతాలుకు నియామకపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 6 : కుర్మిద్ద గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా పర్వతాలు నియమించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు ఆదేశాల మేరకు పార్టీ మండలాధ్యక్షుడు విజయ్‌గౌడ్, వైస్ ఎంపీపీ గోవర్ధన్ ఆధ్వర్యంలో పర్వతాలు ఎంపిక చేసి అతడికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని జైపాల్‌యాదవ్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## రైతులకు అవగాహన సదస్సు

ఊర్కొండ, అక్టోబర్ 6: రైతులు సకాలంలో రుణాలు చెల్లించి కొత్త రుణాలు తీసుకోవాలని ఏపీజీవీబీ అధికారులు అన్నారు. శుక్రవారం రైతులకు, అకౌంట్ దారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని ఊర్కొండపేటలో అకౌంట్ దారులకు వివిధ అంశాలపై వివరించారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ రుణాలు, బీమా పతకాల లబ్ధిదారులకు వివరించారు. ఒక్క యేడు రూ.1,456 కడితే రూ.24 లక్షల వరకు ఇన్సూరెన్స్ వస్తుందన్నారు. రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి కోటేశ్‌రెడ్డి, సర్పంచ్ అనితనాగోజి, ఉపసర్పంచ్ బొల్గం బుచ్చమ్మ, పాపయ్యగౌడ్, ప్రకాశ్ గుప్తా, నర్సిరెడ్డి, అంజయ్యగౌడ్, రేపనిశ్రీను, సిద్దు, అజహర్, మహిళా సంఘాలు రైతులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్

## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 6 : నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదామును కలెక్టర్ ఉదయ్‌కుమార్ తనిఖీ చేశారు. కలెక్టర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి శుక్రవారం తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోడౌన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ గోదాముల వద్ద ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారి సమక్షంలో ఈవీఎం గోదాములోపల భద్రపరిచిన మొదటిస్థాయి తనిఖీ పూర్తి చేసి ఉంచిన ఈవీఎం యంత్రాలతోపాటు గదుల్లో ఉన్న వీవీప్యాట్స్, ఇతర ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వస్తు సామగ్రిని, భద్రత చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈవీఎంలను భద్రపరిచిన తీరు పట్ల సంతృప్తిని వ్యక్తం చేసి పర్యవేక్షణ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈవీఎం గోదాం చుట్టుపక్కల పటిష్టంగా నిఘా ఉంచాలని, చుట్టుపక్కల అనుమతి లేని, అపరిచితులను ఎవరిని అనుమతించొద్దని భద్రత సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల తాసీల్దార్ జాకిర్‌అలీ, ఎన్నికల విభాగం డిప్యూటీ తాసీల్దార్ రఘు, వైఎస్‌ఆర్ పార్టీ నాయకులు ఎండీ హుస్సేన్, టీటీడీపీ నాయకులు బాలకృష్ణ, కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంలు భద్రపరిచిన గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

## నిరంతర కృషితోనే మంచి ఫలితాలు

- జిల్లా ఇంటర్‌విద్య నోడల్ అధికారి వెంకటరమణ

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 6 : విద్యార్థుల జీవితాల్లో ఇంటర్ విద్య చాలా కీలకమని నిరంతర శ్రమవల్లనే భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించవచ్చని జిల్లా ఇంటర్ విద్యార్థుల నోడల్ అధికారి జి.వెంకటరమణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థులు, 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశం పొందిన మొదటి సంవత్సర విద్యార్థులకు ఘనంగా స్వాగత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు మంచి ఫలితాలు రాబట్టడంలో పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కళాశాలకు ఎంతో పేరు ఉందని, ఈ కళాశాలలో చదివిన వారు రాజకీయ నాయకులుగా, విద్యావేత్తలుగా, సామాజిక కార్యకర్తలుగా ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడ్డారని విద్యార్థులకు తెలిపారు. సమావేశంలో గతంలో ఇక్కడ పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగి నర్సయ్య బదిలీపై వెళ్ళగా అధ్యాపకులు వసంతకుమార్ ఫిజిక్స్ లెక్చరర్, నర్సింహారావు అధ్యాపకుడిని సన్మానించారు. అంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ మాధవి అధ్యక్షత వహించగా, సీనియర్ అధ్యాపకులు నర్సింహులు, లైబ్రేరియన్ కే.రవీందర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, నోడల్ ఆఫీస్ సూపరింటెండెంట్ ఎం.ఏ. నిరంజన్, అధ్యాపకులు రవిప్రకాష్, వెంకట్‌రెడ్డి, యూనిస్, హరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి చేయూత



రాచూర్‌తండాలో ఆర్థికసాయం అందజేస్తున్న ఐక్యత సభ్యులు

వెల్దండ, అక్టోబర్ 6 : మండలంలోని రాచూర్‌తండాలో భన్యానాయక్ అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని శుక్రవారం ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పరామర్శించారు. చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి సహకారంతో రూ.5వేలు ఆర్థికసాయం మృతుడి భార్యకు అందజేశారు. కార్యక్రమంలో శ్రీను నాయక్, రఘుపతి, భీముడు, గోపాల్, మణిపాల్ తదితరులు ఉన్నారు.

## ప్రతిఓటరుకు కొత్త ఎపిక్ నెంబర్

తెలకపల్లి, అక్టోబర్ 6 : ప్రతిఓటరుకు కొత్త ఎపిక్ నెంబర్ ఇస్తున్నామని తాసీల్దార్ మురళీకృష్ణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 2012కు ముందు ఓటరు నమోదు చేసుకున్న వారికి 9 అంకెల ఎపిక్ నెంబర్ ఉండేదని తెలిపారు. కాగా ప్రస్తుతం ఆ వరుస సంఖ్యను మార్చి పది అంకెల ఎపిక్ నెంబర్‌ను కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతిఓటరుకు వ్యక్తిగతమైన లేఖల ద్వారా సమాచారం తెలుపుతామన్నారు. లేఖలు పోలింగ్‌స్టేషన్‌లో బీఎల్‌వోల వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గత నెల 19వ తేదీ వరకు ఓటరు నమోదు చేసుకున్న వారికి ప్రస్తుతం ప్రకటించిన జాబితాలో పేర్లు చేర్చబడుతాయన్నారు. 20వ తేదీ తర్వాత నమోదు చేసుకున్న వారికి వచ్చే జాబితాలో పేర్లు వస్తాయని తెలిపారు.